రక్షణ కల్పించాలి



మహిళా వైద్యులపై అత్యాచారాలు, హత్యలు చేస్తున్న వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మహిళా వైద్యులపై ఇటువంటి ఘటనలు బాధాకరం . ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చట్టాలు తీసుకురావాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ఉద్యోగినులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలి. అప్పుడే మహిళలపై దాడులు, అత్యాచారాలు తగ్గుతాయి.

– వంగూరు రమేష్‌బాబు, సర్వీస్ స్వచ్ఛంద సేవా సంస్థ, మైలవరం



వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే డాక్టర్లపై దాడులకు దిగి అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి. కోల్‌కతాలో విధులు నిర్వహిస్తున్న ట్రైనీ డాక్టర్‌పై పైశాచికంగా ప్రవర్తించిన దోషులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. డాక్టర్లకు రక్షణగా వైద్యశాలల్లో పోలీస్ పెట్రోలింగ్ ప్రతి రోజూ నిర్వహించాలి. డాక్టర్లు, వైద్య సిబ్బందిలో ఆత్మస్థైర్యం నింపాలి.

– రామసీత, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి

పెట్టుబడి సాయం ఏదీ?

- ఎన్నికల ముందు రూ. 20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడుస్తున్నా అందని సాయం
- పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించిన రైతులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే అందిన సాయం



నూజివీడు మండలంలో నాట్లు వేసిన వరి పొలం

నూజివీడు: కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చారు. ఆశల పల్లకిలో వారిని ఊరేగించింది. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టారు. వారు ఇచ్చిన హామీల్లో రైతులకు పెట్టుబడి సాయం ఒకటి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విస్మరిస్తున్నట్టుగా కనిపిస్తోంది. పెట్టుబడి సాయం కింద రైతులకు ప్రతి ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేస్తామని ఎన్నికల ముందు సూపర్ సిక్స్‌లో భాగంగా ఊదరగొట్టిన చంద్రబాబు..ముఖ్యమంత్రి అయ్యాక హామీని తుంగలో తొక్కడం ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు గడిచినా రైతులకు చెల్లించాల్సిన పెట్టుబడి సాయంపై కూటమి ప్రభుత్వ పాలకులు నోరు మెదపడం లేదు. ఖరీఫ్ సీజన్ దాటుతున్నా పాలకుల్లో ఇచ్చిన హామీని నెరవేరుద్దామనే ఆలోచన లేకపోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో రైతులు 18 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు.

సీజన్‌కు ముందే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు భరోసా పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేసేది. దీంతో రైతులు పంటలను సాగు చేసేందుకు ఆ మొత్తాన్ని ఉపయోగించుకునేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రైతులకు రూ.20 వేలు విడుదల చేసే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదనే అభిప్రాయం రైతుల్లోనే వ్యక్తమవుతోంది.

గత ప్రభుత్వంలో 41,349 మంది రైతులకు రూ. 188 కోట్ల లబ్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఐదేళ్లలో నియోజకవర్గంలో 41,349 మంది రైతులకు సుమారు రూ.188 కోట్లు అందజేసింది. వైఎస్సార్ పంటల బీమా కింద రూ.5.01 కోట్లను, రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.2.24 కోట్లను రైతులకు అందజేసి వ్యవసాయాన్ని పండుగ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయం ఎప్పుడు ఇస్తుందోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెట్టుబడి సాయం వెంటనే విడుదల చేయాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం విడుదల చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 75 రోజులు గడిచినా టీడీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద విడుదల చేయాల్సిన రూ.20 వేలు చెల్లించకుండా నట్టేట ముంచింది. పంటల సాగుకు చిన్న సన్నకారు రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది.

– బాణావతు రాజు, లైన్‌తండా, నూజివీడు

ముత్యాలమ్మకు బోనాలు





జలబిందెల పూజలో పాల్గొన్న మహిళలు

గంపలగూడెం: శ్రావణమాసం ఆదివారం సందర్భంగా గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ముత్యాలమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. గ్రామ దేవతల ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. తమ ఇళ్ల నుంచి తయారుచేసి తీసుకువచ్చిన పొంగలి, వంటకాలతో బోనం సమర్పించారు. అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గంపలగూడెం, వినగడప, ఊటుకూరు, కనుమూరు తదితర గ్రామాల్లో ముత్యాలమ్మ బోనాలతో సందడి నెలకొంది.

గ్రామ దేవతలకు పొంగళ్లు

విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో శ్రావణ మాసం ఆదివారం సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు సమర్పించారు. స్థానిక సత్తుపల్లి రోడ్డులోని ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు సమర్పించారు.

కోట మహాలక్ష్మి అమ్మవారికి జలాభిషేకం

మైలవరం: శ్రావణ మాసం సందర్భంగా స్థానిక కోట మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆదివారం 101 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. మైలవరం జమీందారు, ద్వారకా తిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు. తొలుత అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వణుకు పుట్టిస్తున్న వీధి కుక్కలు

భయం గుప్పెట్లో గ్రామాలు



వీధిలో తిష్టవేసిన కుక్కలు

ముసునూరు: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల సమస్య అధికంగా ఉంది. వీధుల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాకపోకలు సాగించే ప్రజలపై, వాహన చోదకులపై దాడులు చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలు, మహిళలు వీటి బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో ఇవి ఒక చోట చేరి మొరుగుతుండటంతో ప్రజల నిద్రకు ఆటంకం కలుగుతోంది. చెక్కపల్లి, ముసునూరు, కాట్రేనిపాడు, వలసపల్లి తదితర గ్రామాల్లో తెల్లవారుజామున పొలాలకు వెళ్లే రైతులు, మార్నింగ్ వాక్‌కు వెళ్లే వృద్ధులు, మహిళలు వీధికుక్కల కాటుకు గురవుతున్నారు. ఇటీవల చింతలవల్లిలో కుక్కలు ద్విచక్ర వాహనదారులపైకి ఎగబడడంతో వారు బైక్ పైనుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యారు. లోపూడిలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు విద్యార్థులను వీధి కుక్కలు కరవడంతో తీవ్ర గాయాలపాలై పీహెచ్‌సీలో రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. గత మూడు నెలల కాలంలోనే చెక్కపల్లి, గోపవరం, కాట్రేనిపాడు, సూరేపల్లి తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి కుక్కలను నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు



ఇబ్రహీంపట్నం: వాహన చోదకులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో హెల్మెట్ వినియోగంపై ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. మొదటిసారిగా అవగాహన కల్పించి కొద్దిపాటి జరిమానా విధించారు. ప్రాణాల రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సూచించారు. వాహనం నడిపే సమయంలో మనకోసం మన కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారనే ధ్యాస కలిగి ఉండాలన్నారు. ఎస్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభం



తిరువూరు వేంకటాచలస్వామి ఆలయంలో కృష్ణుని వేషధారణలో స్వామివారు



విద్యుత్ దీపాల వెలుగులో ఆగిరిపల్లిలోని ఆలయం

తిరువూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు తిరువూరులోని పలు దేవాలయాల్లో ఆదివారం ప్రారంభమయ్యాయి. వేంకటాచలస్వామి దేవస్థానంలో స్వామి వారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం అభిషేకం, తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీకృష్ణాష్టక పారాయణం, సంకీర్తన జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. తిరువూరు కోదండ రామాలయంలో 27న సాయంత్రం కృష్ణాష్టక పారాయణం అనంతరం రాధాకృష్ణావతార వేషధారణ ప్రదర్శన, ఉట్టికొట్టే కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ వివరించింది.

నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

నూజివీడు: ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు కొత్తరావిచర్లలో సోమవారం నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు నిర్వహిస్తామని సర్పంచి కాపా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు శ్రీ కృష్ణుడికి పూజలు నిర్వహించిన అనంతరం భగవద్గీత శ్లోకాల భావం వివరిస్తారన్నారు. ఆధ్యాత్మిక నాటికలు, శ్రీ కృష్ణుడి పాటలకు నృత్య ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.

రేపు నెమలిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

గంపలగూడెం: నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. 27న ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, వస్త్ర సమర్పణ, విశేష పూజా కైంకర్యాలు, బాలభోగ నివేదన జరుగుతాయన్నారు. సాయంత్రం ఐదు గంటలకు వేణుగోపాలస్వామి నవనీత అలంకృతులై ఉట్టికొట్టే ఉత్సవం, తర్వాత చత్రధామం, గ్రామోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

కృష్ణాష్టమికి ఆలయం ముస్తాబు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో వరాహ పుష్కరిణి వద్ద గల వేణుగోపాలస్వామి ఆలయం కృష్ణాష్టమి వేడుకలకు సిద్ధమైంది. విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, రాధాకృష్ణుల కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నామని శ్రీకృష్ణ యువసేన సంఘ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలు

మైలవరం: మైలవరం పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం కారు, వ్యాన్ ఢీకొన్న ఘటనలో కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంభంపాడుకు చెందిన ఏసుబాబు విజయవాడ నుంచి కారులో బయలుదేరాడు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోకి రాగానే నిద్రమత్తులో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఏసుబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని పోలీసులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టాలెంట్‌టెస్ట్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



తిరువూరు: విద్యార్థులు చదువుతో పాటు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. సెప్టెంబరు 25న నిర్వహించనున్న చెకుముకి ప్రాథమిక పరీక్ష ప్రచార వాల్‌పోస్టర్లను ఆదివారం తిరువూరులో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చేతబడి, బాణామతి వంటి మూఢాచారాలు నేటికీ గ్రామాల్లో నెలకొన్నాయని, వీటి కారణంగా గ్రామీణ ప్రజలు ఆధునిక సమాజానికి దూరంగా ఉంటున్నారని చెప్పారు. విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు జన విజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తోందన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, సభ్యులు రాంప్రదీప్ పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత శ్రీరాములు మృతి

మైలవరం: మైలవరం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు కె. శ్రీరాములు (65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. మృతునికి భార్య రామచంద్రమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీరాములు మృతికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, బి. వెంకట్రావు, షేక్ జిలాని, రామకృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

29న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిరువూరు: తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె. పాపారావు తెలిపారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగుభాష ఔన్నత్యం అనే అంశంపై వ్యాసరచన పోటీలను 29న ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని, 5,6,7 తరగతుల విద్యార్థులు జూనియర్స్ విభాగంలో, 8,9,10 తరగతుల విద్యార్థులు సీనియర్స్ విభాగంలో పోటీలకు హాజరుకావచ్చని చెప్పారు. ఉదయం 11 గంటలకు తెలుగు భాష ఔన్నత్యంపై తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు విజయానందరాజు ప్రసంగం ఉంటుందన్నారు. వ్యాస రచన పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

నేడు భగవద్గీత శ్లోక పఠన పోటీలు

మైలవరం: కృష్ణాష్టమి సందర్భంగా మండలంలోని విద్యార్థులకు భగవద్గీత శ్లోక పఠన పోటీలు సోమవారం నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడు శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరంలోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని చెప్పారు.

క్లుప్తంగా

200 మందికి వైద్య పరీక్షలు



ఆగిరిపల్లి: ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం, విజయవాడ సెంటినీ హాస్పిటల్ వారిచే స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 200 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ చైర్మన్ కాసుల కోనయ్య, కార్యదర్శి ప్రత్తిపాటి సురేష్, జిల్లా అధ్యక్షుడు నంజం రామకృష్ణ, ఎంపీడీఓ శంకర్‌రావు, రీజినల్ మీడియా చైర్మన్ ఎస్ఎస్ బాబు, జిల్లా వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, తవ్వ మురళీధర్, మోహన్ స్పిన్‌టెక్స్ జనరల్ మేనేజర్ తాండవ కృష్ణ పాల్గొన్నారు.

సునీల్‌బాబు కుటుంబానికి పరామర్శ



పుట్రేల(విస్సన్నపేట): పుట్రేల మారెమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ తిరువూరు ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆదివారం పరామర్శించారు. సునీల్‌బాబు తండ్రి చిన్న జగన్నాథరావు (చంటిబాబు) (90)అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. చంటిబాబు భౌతికకాయానికి స్వామిదాసు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, దోర్నాల దామోదరరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఎంపీటీసీ జి. మల్లయ్య, కొలికపోగు ఏషియా, బడుగు భాస్కరరావు, పిల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటులో ఎల్ఎఫ్ఎల్ పోస్టును మినహాయించాలని లేఖ

నూజివీడు: ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటులో ఎల్ఎఫ్ఎల్ పోస్టును పరిగణనలోకి తీసుకోకుండా ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీ సర్‌ప్లస్ టీచర్లను లెక్కించాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌జీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం విద్యా శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. కొన్నిచోట్ల 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 90 లోపు విద్యార్థులకు ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులు ఐదు తరగతులకు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బోధనకు తీవ్ర ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందని చెప్పారు. ఎస్‌జీటీల సర్‌ప్లస్‌ను గుర్తించే క్రమంలో ఎల్ఎఫ్ఎల్ పోస్టును మినహాయించి లెక్కించాలని కోరారు. అదేవిధంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఉన్న ఉపాధ్యాయులను డివిజన్ స్థాయిలో కాకుండా మండల స్థాయిలోనే వారిని పని సర్దుబాటు నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ముసునూరు ఎస్ఐ వాసు బదిలీ

ముసునూరు: ముసునూరు ఎస్ఐ పి.వాసు బదిలీ అయ్యారు. ఆదివారం సాయంత్రం ఆయన ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ముసునూరు ఎస్ఐగా ఇంకా ఎవరినీ నియమించ లేదు.

ఎక్కడి చెత్త అక్కడే!



నూజివీడు పట్టణంలోని ఎన్నెస్పీ గేటు వద్ద చెత్త

పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎక్కడి చెత్త పోగులు అక్కడే దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా వదిలి వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పర్మినెంట్ పారిశుద్ధ్య సిబ్బంది ప్రధాన రహదారుల వెంట చెత్తపోగులు తొలగిస్తుండగా, మిగిలిన ప్రాంతాలలోని చెత్తచెదారం అలాగే ఉంటోంది. మూడో వార్డులోని కోనేరుపేటలో, బ్యాంకు స్ట్రీట్ వద్ద, గాంధీనగర్, ఏరియా ఆస్పత్రి, ఎన్నెస్పీ గేటు, ఎంప్లాయీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి ఉంది. ఆదివారం వస్తే చెత్త ఎత్తడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసైనా చెత్తను ఎత్తించాలే గాని, ఆదివారం చెత్త ఎత్తకపోతే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు ప్రజలు డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో ఆస్పత్రుల పాలై తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతుంటే మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –నూజివీడు



గాంధీనగర్‌లో రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తచెదారం



ఏరియా ఆసుపత్రి వద్ద ఇలా